ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024


కల్పవృక్షవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు


హనుమద్వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చెన్నకేశవుడి వైభోగం

కల్పవృక్ష, హనుమంత వాహనాలపై ఊరేగింపు

ధర్మవరం, మే 18: లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నాలుగో రోజు శనివారం భక్తులను అలరించాయి. స్వామివారు ఉదయం కల్పవృక్ష వాహనంపై, సాయంత్రం హనుమద్వాహనంపై భక్తులను అనుగ్రహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు కోనేరాచార్యులు, బానుప్రకాశ్ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పట్టణ వీధులలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యం, డైరెక్టర్‌లు పొరాళ్ల పద్మావతి, సత్రశాల సత్యనారాయణ, ఈఓ వెంకటేశ్వర్లు, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివాకి ఆదివారం ఉదయం పల్లకి సేవ, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

అలరించిన లీలామృతం

పుట్టపర్తి, మే 18: చెన్నయ్‌కు చెందిన బాలవికాస్ విద్యార్థులు సంగీతనృత్యంతో భక్తులను అలరింపజేశారు. పర్తియాత్ర పేరుతో చెన్నయ్‌కు చెందిన బాలవికాస్ విద్యార్థులు, సత్యసాయి భక్తులు సుమారు 500 మంది శనివారం పుట్టపర్తికి చేరుకున్నారు. అక్కడ ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సాయంత్రం బాలవికాస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లీలామృతం పేరిట సంగీతనృత్యరూపకాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. అలాగే నృత్యగానంతో భక్తులను అలరింపజేశారు. తర్వాత సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

సెలవుల సందడి..

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మే 18: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం కావడంతో ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చకులు ఉదయమే ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి సెలవులు ఉండడంతో పాటు ఎన్నికలు ముగియడంతో భక్తులు కుటుంబ సమేతంగా వచ్చారు. ఉమ్మడి అనంత జిల్లాతో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల భక్తులు తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు పొందారు. భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహిళలు ధ్వజస్తంభం ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


ధ్వజస్తంభం ఎదుట దీపాలు వెలిగించిన భక్తులు

పునాదుల వద్ద బడి

బిల్లులు రాక ఆగిన పనులు.. ఎంజేపీ పాఠశాల విద్యార్థులకు అవస్థలు


ప్లాస్టింగ్‌కు నోచుకోని ప్రిన్సిపాల్ గది

రొద్దం, మే 18: రెండేళ్లుగా బిల్లులు అందకపోవడంతో రొద్దం ఎంజేపీ పాఠశాల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ అర్ధంతరంగా ఆపేసి వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వం 2019లో రొద్దం మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో రూ.15.38 కోట్లతో ఈ పాఠశాల భవన నిర్మాణ పనులను చేపట్టింది. అప్పటి మంత్రి శంకర్ నారాయణ భూమిపూజ చేశారు. కొవిడ్ కారణంగా పనులకు ఆటంకం కలిగింది. 2021 నుంచి 2022 వరకు నిర్మాణ పనులు చేపట్టారు. ఐదెకరాల్లో తరగతి గదులు, వంటశాల, ప్రిన్సిపాల్ గది, వాటర్ ట్యాంక్ పనులు చేపట్టారు. కానీ బిల్లులు రాకపోవడంతో పునాది దశలోనే వదిలేశారు. కాంట్రాక్టరు రూ.2 కోట్ల పనులు చేసినా ఒక్క బిల్లు కూడా రాలేదు. దీంతో పనులను ఆపేశారు.

విద్యార్థులకు ఇబ్బందులు..

రొద్దం ఎంజేపీ పాఠశాల ఆర్.మరువపల్లిలోని షిర్డీసాయి కళ్యాణమండపంలో 500 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. 5 నుంచి 10వ తరగతి వరకు హాస్టల్ సౌకర్యం ఉంది. వీరికి ఆరు మరుగుదొడ్లు, ఆరు స్నానపు గదులు ఏమాత్రం చాలడంలేదు. భవన నిర్మాణ పనులు ఆగిపోవడంతో అద్దె భవనంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్యను 500 నుంచి 240కి తగ్గించారు.

టీడీపీ హయాంలో..

ఎంజేపీ పాఠశాలకు 2018లో అప్పటి ఎమ్మెల్యే బీకే పార్థసారథి రూ.35 కోట్లు నిధులు తెప్పించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే రూ.35 కోట్ల నిధులను రూ.15 కోట్లకు కుదించారు. పాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించినా.. ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వమైనా చిత్తశుద్ధి చూపించాలని, వెంటనే భవన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


అర్ధంతరంగా ఆగిన ఆర్. మరువపల్లిలోని ఎంజేపీ పాఠశాల పనులు

ప్రాంతం	పుట్టపర్తి		కదిరి		ధర్మవరం		హిందూపురం		పెనుకొండ	
గరిష్ఠం కనిష్ఠం	27.0	24.0	27.0	25.0	27.0	25.0	26.0	23.0	31.0	24.0

క్రాస్..ఫినిష్..!



పురంలో భారీగా క్రాస్ ఓటింగ్



- వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి గుబులు
- ప్రచారంలో ఎవరికి వారుగా వ్యవహారం
- ఒక్క ఓటు చాలు.. రెండోది మీ ఇష్టమన్నారు..
- అదే ఇప్పుడు కొంప ముంచిందని ఆందోళన
- పట్టణంలో ఆరా తీస్తున్న అధికార పార్టీవారు



హిందూపురం, మే 18: అధికార పార్టీకి హిందూపురంలో క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. పురంలో ఎంపీ,న ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరికి వారు ప్రచారం నిర్వహించుకున్నారు. ఒకరితో ఒకరికి సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. ఎవరి ఓటు వారు అడిగారు తప్ప రెండు ఓట్లు తమ పార్టీకి వేయాలని అడిగిన దాఖలాలు లేవని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు. ఇప్పుడు అదే వారిని వెంటాడుతోంది. కొన్నిచోట్లయితే ఒక్క ఓటు మాకు వేయండి.. ఇంకో ఓటు మీ ఇష్టం అని బహిరంగంగానే ప్రచారం చేశారు. ఒక అభ్యర్థి వర్గం ఒక ఓటు తమకు వేసి, మరోఓటు కాంగ్రెస్ పార్టీకి వేయాలని కూడా ప్రచారం చేసింది. దీంతో మరో అభ్యర్థి వర్గంవారు తాము మాత్రం తక్కువా అన్నట్లుగా.. 'ఒక ఓటు మాకు వేయండి.. ఇంకో ఓటు మీ ఇష్టం' అని ప్రచారం చేశారు. పోలింగ్ ముగిశాక ఇద్దరు అభ్యర్థులు మేల్కొన్నట్లు కనిపిస్తోంది. తమ ప్రచార తీరే తమ కొంప ముంచుతుందని ఆందోళన చెందుతున్నారు. క్రాస్ ఓటింగ్ భయం వారికి కునుకు లేకుండా చేస్తోంది. ఓటర్లు ఏ ఓటు ఎవరికి వేశారో అన్న గుబులు మొదలైంది. మూడు రోజులుగా ఒక వర్గం నాయకులు వార్డుల్లో దీనిపైనే ఓటర్లను ఆరాతీస్తున్నారు. కొంతమంది నాయకులతై నమూనా బ్యాలెట్ తీసుకెళ్లి ఇందులో ఏ గుర్తుకు ఓటేశారని అడుగుతున్నారు. హిందూపురంలో అధికార పార్టీలో ఇదే ఇప్పుడు హాట్ టాపిక్.

సఖ్యత ఏదీ..?

అధికార పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా దీపిక, ఎంపీ అభ్యర్థిగా బోయ శాంత బరిలో నిలిచారు. వీరి వర్గీయులు ఎవరికి వారుగా విడిపోయారు. కొంతమంది నాయకులు రహస్యంగా, మరికొందరు బహిరంగంగా 'ఒక్క ఓటు' మాత్రమే కోరినట్లు చర్చ జరుగుతోంది. కొన్ని నెలల క్రితం కర్ణాటకకు చెందిన జోళదరాశి శాంతి వైసీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా వచ్చారు. మొదటి నుంచి ఆమెకు దీపిక వర్గంతో సఖ్యత కుదరలేదు. ఇదే తీరు ప్రచారంలో కొనసాగింది. ఎవరికి వారు అన్నరీతిలో ఓటర్లవద్దకు వెళ్లారు. ఏ ఒక్కరూ రెండు ఓట్లు వేయాలని ఎక్కడా అడిగలేదని అధికార పార్టీ నాయకులే అంటున్నారు. దీనివల్ల ఆ పార్టీ బలంగా నమ్ముకున్న ఓ సామాజికవర్గం ఓటర్లు క్రాస్ ఓటింగ్ చేశారు.

వారి ఓట్లపైనే ఆందోళన

హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీకి బలంగా ఉన్న ఓ సామాజికవర్గం ఓటర్ల తీర్పు ఎలా ఉందో అన్నది చర్చనీయాంశంగా మారింది. వైసీపీ నాయకుల ఆందోళనకు కారణం.. సొంత ఓటర్లు క్రాస్ చేశారేమో అన్న అనుమానమే. ఆ ఓటర్లకు కొన్ని వార్డుల్లో, కొన్ని గ్రామాల్లో క్రాస్ ఓటింగ్‌కు దిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవర్గంవారు ఒక ఓటు వైసీపీకి ఒక ఓటు కాంగ్రెస్ వేశారు. మరోవర్గంవారు ఒక ఓటును మాత్రమే వైసీపీకి వేశారు. మరో ఓటు ఏ పార్టీకి పడిందన్నది ఆసక్తికరంగా మారింది. క్రాస్ ఓటింగ్ భారీ స్థాయిలో జరిగి ఉంటే తమకు ఓటమి తప్పదని ఆందోళన చెందుతున్నారు. క్రాస్ జరిగి ఉంటే ఎంతమేర నష్టం కలిగి ఉంటుందన్న అంచనాలు వేస్తున్నారు. హిందూపురం పట్టణంలో దీనిపై ఎక్కువగా ఆరా తీస్తున్నారు. ఎందుకంటే పట్టణంలో ఆ సామాజికవర్గం ఓటర్లు 25వేల దాకా ఉన్నారు. అధికార పార్టీకి ఆ సామాజికవర్గంపైనే ఎక్కువ ఆశలు పెట్టుకుంది. వారే క్రాస్ ఓటింగ్‌కు దిగితే తమ కొంప కొల్లేరే అని భయపడుతున్నారు. ఎక్కడ తప్పు జరిగిందోనని లెక్కలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

80 శాతం సంబరమే తప్ప..

అధికార పార్టీ అభ్యర్థులకు ఒక సామాజికవర్గం ఓట్లు 80 శాతం పడ్డాయని పోలింగ్ రోజు, మరుసటి దినం సంబరపడ్డారు. తమకు పట్టణంలో మెజార్టీ వస్తుందని లెక్కలు కూడా కట్టారు. ఆ తరువాత కొన్ని చోట్ల ఓటర్లు ఆరాతీయగా.. క్రాస్ ఓటింగ్ జరిగిన విషయం బయట పడింది. దీంతో వారి ఆనందం ఆవిరయ్యింది. తమ పరిస్థితి ఏమిటని ఒక్కసారిగా ఆలోచనలో పడ్డారు. హిందూపురం పట్టణంలో పలు వార్డుల్లో గత మూడు రోజులుగా కొంతమంది నాయకులు, బయటి వ్యక్తులు వచ్చి సర్వే చేస్తున్నారు. ఓటు వేసిన వారితో మాట్లాడి.. క్రాస్ ఏ మేరకు జరిగిందోనని ఆరా తీస్తున్నారు. జూన్ 4 వరకూ తమకు గుండెల్లో దడ తప్పదని అధికార పార్టీవారు అంటున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

హిందూపురం, మే 18: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. హిందూపురం మండలంలోని బిట్ కళాశాల, లేపాక్షి మండలం నాయనపల్లివద్ద స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం వారు పరిశీలించారు. భద్రతను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల కేంద్ర బలగాలు మూడంచెలుగా కాపలా కాస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాల నిఘా ఉందని అన్నారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్‌డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ కంజాక్షన్, రెవెన్యూ అధికారులు వారి వెంట ఉన్నారు. అనంతరం బిట్స్ కళాశాల, నాయనపల్లి, గురుకుల పాఠశాలలో కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్వోలకు సూచించారు.


స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

డంప్ యార్డు కంపు

గోరంట్లను కమ్ముకుంటున్న పొగ

గోరంట్ల, మే 18: రావికుంట చెరువులోని డంపింగ్ యార్డులో చెత్తకుప్పకు తరచూ నిప్పు పెడుతుండడంతో గోరంట్ల పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ విస్తరణ కారణంగా రావికుంట చెరువు ఆయకట్టు కనుమరుగైంది. దీంతో చెరువు ప్రాంతాన్ని పంచాయతీ వారు డంపింగ్ యార్డుగా మార్చారు. పట్టణంలో వెలువడే వ్యర్థాలు, చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చికెన్ సెంటర్ల వ్యర్థాలను కూడా వేస్తున్నారు. డంపింగ్ యార్డుకు సమీపంలో కూరగాయల వారపు సంత, రెడ్డివారి వీధి, జామియా మసీదు, ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. చెత్తకు నిప్పు పెట్టిన ప్రతిసారీ పొగ కమ్ముకుంటోంది. దుర్వాసన వ్యాపిస్తోంది. స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలు ఉన్నవారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. దట్టమైన పొగ కారణంగా రహదారి కనిపించడం లేదు. డంపింగ్ యార్డును మరోచోటికి మార్చాలని ప్రజలు విన్నవించినా.. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. 3, 4వ వార్డు ప్రజలు మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ సూర్యనారాయణకు, పంచాయతీ కార్యాలయంలో గుమస్తా సాయి సంజయ్‌కు శనివారం మరోమారు వినతిపత్రం సమర్పించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ, పొగమయమైన జామీయా మసీదు ప్రాంతం, రహదారిని కమ్మేసిన పొగ


కూటమికే జై..!

- కేతిరెడ్డికి స్థానికంగా వ్యతిరేకత
- భూ కబ్జాలు, ఇసుక దందాతో నష్టం
- సత్యకుమార్‌కు అన్నివర్గాల మద్దతు
- పోలింగ్ తరువాత విశ్లేషకుల అంచనా

ధర్మవరం, మే 18: ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు స్థానికంగా అధికార పార్టీ నాయకుల తీరు కూడా టీడీపీ కూటమికి కలిసొస్తుందని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టమైంది. ఐదేళ్లలో జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తి కనిపించింది. హామీల అమలు కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడితే కేసులు పెట్టారు. దౌర్జన్యాలకు దిగారు. సామాన్యులు, విపక్ష నాయకుల అరెస్టులు, వారిపై భౌతిక దాడులతో రెచ్చిపోయారు. మరో వైపు అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్లాల్సి వచ్చింది. ఇంకో వైపు భూ దందాలు, కబ్జాలు, ఇసుక దందాతో జనం విసిగిపోయారు. అందుకే ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పోలింగ్ నాడు వైసీపీకి వ్యతిరేకంగా, కూటమికి అనుకూలంగా ఓటర్లు క్యూయ కట్టారని, భారీ పోలింగ్‌కు ఇదే కారణమని విశ్లేషణలు చెబుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధిక శాతం కూటమికి పడ్డాయి. నిరుద్యోగ యువత, అర్బన్ ఓటరు, ఐటీ ఉద్యోగులు, మహిళలు కూటమికే మద్దతు పలికారని వివిధ సర్వేల ద్వారా తెలుస్తోంది. దీంతో విజయావకాశాలపై కూటమి నేతలు ధీమాగా ఉన్నారు.

స్థానికంగా వ్యతిరేకత

ధర్మవరం అభ్యర్థులుగా వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి సత్యకుమార్ బరిలో దిగారు. ఇద్దరూ ముమ్మర ప్రచారం చేశారు. మరో అవకాశం ఇవ్వాలని కేతిరెడ్డి, ఒక్క అవకాశం ఇవ్వాలని సత్యకుమార్ అభ్యర్థించారు. ఇద్దరి మాటలు విన్న జనం.. మంచిచెడులను బేరీజు వేసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గానికి ఒరిగింది లేదని ఓటర్లకు అర్థమైంది. ధర్మవరంలో కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. పైగా నిరుపేదలకు రూ.5లకే భోజనం అందించే అన్న క్యాంటీన్లను ఎత్తేశారు. ఎక్కడా రోడ్లు వేయలేదు. గుంతల రహదారుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. నాడు-నేడు పేరిట కొన్ని పాఠశాలలను బాగు చేశారేగాని.. విలీనం పేరుతో చిన్నారులను బడికి దూరం చేశారు. ఇంటి వద్దకే రేషన్ అని చెప్పి, ఆ వాహనం కోసం కార్డుదారులు ఎదురుచూడాల్సిన దుస్థితిని కల్పించారు. నిత్యావసర సరుకుల కింద బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే ఇస్తున్నారు. వైసీపీ నేతలు విలువైన ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్, డీకేటీ భూములను కబ్జా చేశారు. ఇవన్నీ వైసీపీ అభ్యర్థికి ఎన్నికల్లో వ్యతిరేకంగా మారాయని విశ్లేషకులు అంటున్నారు.




మరీ ముఖ్యంగా నియోజకవర్గంలో సాగిన ఇసుక దందా ప్రజలకు, రైతులకు ఆగ్రహం తెప్పించింది. అధికార పార్టీ వారు నదులను కొల్లగొట్టారు. భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు అడ్డుకున్నా వినిపించుకోలేదు. ఇక్కడి ఇసుకను కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

బలంగా.. సూపర్‌సిక్స్



సూపర్ సిక్స్ పథకాలు కూటమి అభ్యర్థికి అదనపు బలం అయ్యాయి. పింఛన్ రూ.4 వేలకు పెంపు, తల్లికి వందనం పేరిట పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఏటా రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1500.. ఇవన్నీ ఓటర్లను ఆకర్షించాయి. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం, యువతకు నిరుద్యోగ భృతి, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. ఇలా ప్రతి పథకం ఆకర్షించింది. దీంతో మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు కూటమి వైపు మొగ్గు చూపారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్గాల వారీగా విడిపోయి కూటమి అభ్యర్థికి జైకొట్టారని స్పష్టమౌతోంది.

పోలీసులకు సిట్ గుబులు

- తాడిపత్రికి చేరుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- పోలింగ్ ముందు.. తరువాత హింసపై ఆరా
- పోలీసుల వ్యవహార శైలిపై కూడా..
- ఇప్పటికే ఎస్పీ, డీఎస్పీ, సీఐపై వేటు
- మిగిలినవారిలో గుబులు

అనంతపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికలకు ముందు, ఆ తరువాత జరిగిన హింసాత్మక ఘటనలపై విచారణ చేపట్టేందుకు ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించిన నేపథ్యంలో జిల్లాలో కొందరు పోలీసు అధికారుల్లో గుబులు పట్టుకుంది. వైసీపీ నేతలకు అంటకాగడమే ఇందుకు ప్రధాన కారణమన్న అభిప్రాయం పోలీసువర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా పోలింగ్ సందర్భంగా తాడిపత్రి పట్టణంలో హింస చెలరేగడానికి పోలీసుల వైఫల్యమే కారణమనే విమర్శలు లేకపోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోన్న పరిస్థితులు అందరికీ తెలిసిందే.


తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు

ఎన్నికలకు ముందే ఘర్షణలు

ఎన్నికలకు ముందే అనేకమార్లు రెండువర్గాల మధ్య ఘర్షణలు, రాళ్లదాడులు చోటుచేసుకున్నాయి. దీనికితోడు ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన అనుచరవర్గంతో కలిసి మారణాయుధాలతో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డిగానీ ఆయన కుటుంబసభ్యులుగానీ ఇంట్లో లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందన్న చర్చ అప్పట్లో హాట్ టాపిక్‌గా సాగింది. ఒక ఎమ్మెల్యే, ఓ మాజీ ఎమ్మెల్యే ఇంట్లోకి చొరబడటాన్ని మేధావి వర్గాలు తీవ్రస్థాయిలో ఖండించాయి. ఇక అక్కడి నుంచి పరిస్థితులు వేగంగా మారిపోయాయి. ఈ పరిణామాలన్నీ జిల్లాలో పనిచేస్తున్న, బదిలీపై వెళ్లిన అధికారులందరికీ ఎరుకే. ఇలాంటి పరిస్థితుల్లో పోలింగ్ సందర్భంగా హింస చెలరేగే అవకాశం లేకపోలేదన్నది నిర్వివాదాంశం. అలాంటప్పుడు ముందస్తు భద్రతా చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. తాడిపత్రి సమస్యాత్మక ప్రాంతం. ప్రతి ఎన్నికల్లోనూ ఆ మేరకు గుర్తిస్తూ వస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా... ప్రత్యర్థులను వదిలే ప్రసక్తే లేదని జేసీ కుటుంబాన్ని ఉద్దేశించి స్థానిక ఎమ్మెల్యే పెద్దారెడ్డి గతంలో మీడియాతో స్పష్టం చేశారు. పోలీసులు వాటన్నింటిని పరిగణలోకి ఎందుకు తీసుకోలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ సందర్భంగా చెలరేగిన హింసకు కారకులెవరనేది పక్కనబెడితే... ఎన్నికల కమిషన్ స్పష్టమైన నిబంధనలను విధించింది. అభ్యర్థులెవరైనా హంగామాతో అనుచరవర్గాన్ని వెంటబెట్టుకొని పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లకూడదని ఆదేశించింది. ఈ నిబంధనలను అక్కడి పోలీసులు అమలు చేయడంలో విఫలమయ్యారు. ఆ పర్యవసానాలే తాడిపత్రి పట్టణంలోని శాంతినగర్‌లో రాళ్లదాడులకు కారణమైంది. ఒక సంఘటన జరిగిన నేపథ్యంలో అప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారా అంటే అదీలేదు. ఆ దాడులు మరుసటి రోజు మరింత ఉధృతమయ్యాయి. అధికార వైసీపీ నేతల అండతో ఆ పార్టీ శ్రేణులు చెలరేగిపోయారు. పోలీసులు అనుకూలంగా ఉన్నారనే భావనతో టీడీపీకి చెందిన సీనియర్ నాయకుడు ఇంటిపై రాళ్లదాడి చేయడంతోపాటు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఇక అక్కడి నుంచి రాళ్లదాడులు ఆగలేదు. చివరికి మాజీ ఎమ్మెల్యే ఇంటిపైకి దండెత్తే ప్రయత్నం చేశారు. మాజీ ఎమ్మెల్యే అనుచరవర్గం ఆ దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధపడటంతో అటు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఇటు మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి మధ్య ఉన్న కాలేజీ మైదానం రణరంగంగా మారింది. పోలీసులు ఇరువర్గాలను కట్టడి చేసేందుకు చివరికి బాష్పవాయువును ప్రయోగించాల్సి వచ్చిందంటే పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించారన్నది స్పష్టంగా తెలుస్తోంది.

వివాదాస్పదంగా డీఎస్పీ చైతన్య తీరు

ఇదివరకూ తాడిపత్రి డీఎస్పీగా పనిచేసి బదిలీపై వెళ్లిన చైతన్య ఒక్కసారిగా తాడిపత్రిలో ప్రత్యక్షమయ్యారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి అత్యంత సన్నిహితుడిగా డీఎస్పీ చైతన్య ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి అధికారి ఇలాంటి సంఘటనల నేపథ్యంలో తాడిపత్రికి రావడం మరింత వివాదాస్పదంగా మారింది. అధికార పార్టీ పెద్దల ఆదేశాలేమోగానీ జేసీ ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడు దాసరి కిరణ్‌ను అర్ధరాత్రి ఇంట్లో నుంచి లాక్కొచ్చి విచక్షణారహితంగా పోలీసుల చేత కొట్టించడంతో ఆస్పత్రి పాలయ్యాడు. అటు జేసీ నివాసంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పట్టణంలో ఉద్రిక్తత పరిస్థితులకు మరింత ఆజ్యం పోయడానికి ప్రధాన కారకుడు డీఎస్పీ చైతన్య వ్యవహారశైలేనని విమర్శలు వెల్లువెత్తాయి. తాడిపత్రి పట్టణంతోపాటు యాడికి, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న దాడులను ఎన్నికల సంఘం సీరియస్‌గా పరిగణించింది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఎస్పీ అమిత్ బర్దర్, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణలపై సస్పెన్షన్ వేటు వేసింది. కాగా... అన్నమయ్య జిల్లా రాజంపేట డీఎస్పీగా పనిచేస్తున్న చైతన్యను తాడిపత్రికి రప్పించడానికి స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఓ అధికారి జిల్లా ఎస్పీని తప్పుదారి పట్టించినట్లు ఆరోపణలున్నాయి. డీఎస్పీ చైతన్యను తాడిపత్రికి రప్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌కి తెలియదని సమాచారం.

విచారణకు సిట్

అల్లర్లు, ఘర్షణలు, దాడుల నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా అధికార పార్టీకి అనుకూలంగా కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పారదర్శకంగా విచారణ చేపట్టేందుకు సిట్ వేసింది. సిట్ అధికారుల బృందం పోలింగ్ సందర్భంగా తాడిపత్రి, యాడికి, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పరిణామాలు, ఆ తరువాత కేసుల నమోదులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఎలాంటి హడావుడి లేకుండా విచారణ చేస్తున్నట్లు సమాచారం. పోలింగ్‌కు ముందు రాప్తాడులో జరిగిన దాడులపైనా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో సమగ్ర విచారణ నివేదికను సమర్పించాలని ఎన్నికల కమిషన్ సిట్ బృందాన్ని ఆదేశించిన నేపథ్యంలో సిట్ బృందం అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఒకరిద్దరు స్థానిక పోలీసు అధికారుల సాయంతో అల్లర్లు ఏయే ప్రాంతాల్లో జరిగాయో ఆ ప్రాంతాలకు వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం మేరకు మరికొందరు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సిట్ బృందం ఏ మేరకు నివేదిక ఇస్తుందో జిల్లాలో ఎందరు అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటారో చూడాలి.

మొదలైన సిట్ దర్యాప్తు

తాడిపత్రి టౌన్: ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు, పోలీసుల వైఫల్యంపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) శనివారం రాత్రి తాడిపత్రికి చేరుకుంది. ఈ బృందంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఐజీ షిమోషీతో సమావేశమయ్యారు. తాడిపత్రిలో జరిగిన రాళ్లదాడులు, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్ద జరిగిన హింసాత్మక ఘటనల గురించి, పోలీసు అధికారుల వ్యవహారశైలిపైనా ఆరాతీసినట్లు తెలిసింది. అనంతరం గొడవలు జరిగిన ఓంశాంతినగర్, పాతకోట, గానుగ వీధిలో పర్యటించారు. స్థానికులను విచారించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇరువర్గాలు గొడవపడ్డ కళాశాల మైదానంలో కలియతిరిగారు. రాళ్లదాడి ఏ విధంగా జరిగిందని ఆరాతీశారు. బందోబస్తుగా ఉన్న సిబ్బందితో మాట్లాడారు. వారివెంట తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా ఉన్నారు.


స్వామివారి ఆలయం


రేపటి నుంచి పెన్నహోబిలం
లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ, మే 18: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వతేదీ నుంచి ప్రారంభమై 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి పెన్నహోబిలానికి తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 21న ధ్వజారోహణం, రాత్రి ప్రాకారోత్సవం, 22న సింహవాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం, 23న గో, శేషవాహనోత్సవాలు జరగనున్నాయి. 24న హంస వాహనోత్సవం, 25హనుమంత వాహనోత్సవం, 26న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 27న సూర్యప్రభ, ఐరావత వాహనోత్సవం, 28న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 29న అశ్వ వాహనోత్సవం, 30న ధ్వజారోహణం, శయనోత్సవం, 31న ఉత్సవ విగ్రహాల పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు తరలి వెళ్లే కార్యక్రమాలు ఉంటాయి. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.


స్వామివారి మూలవిరాట్

ఆలయ చరిత్ర

అనంతపురం-బళ్లారి రహదారి పక్కన పెన్నానదికి మూడు కి.మీల దూరంలో గిరిపై పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉంది. నరసింహస్వామి, లక్ష్మీదేవి స్వయంభులుగా వెలిశారు. ఈ క్షేత్రం పెన్నానది సమీపంలో ఉండటం, స్వామి వారి పాదముద్రిక కింది భాగాన బిలం ఉండటంతో పెన్నహోబిలంగా పిలవబడుతోంది. ఈ కొండపై పూర్వం ఉద్దాలక మహర్షి తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ గిరికి కింది భాగంలో తూర్పుదిశగా గొల్లపల్లి గ్రామం ఉండేదని, ఒక గోవు ప్రతి రోజూ బిలం వద్ద క్షీరం ఇచ్చేదని చెబుతారు. గోవు పొదుగులో పాలు లేకుండా ఉండడం గమనించి యజమాని కలత చెందుతుండటంతో లక్ష్మీనరసింహస్వామి ఆయనకు అగుపించి తాను క్షీరాన్ని సేవిస్తున్నట్లు తెలుపగా అతడు సంతోషభరితుడై బిలం వద్దకు వెళ్లి శోధించినట్లు గ్రామస్థులు చెబుతారు. ఆ బిలంపై భాగాన స్వామి పాదముద్రికలు ఉన్న శిలాఫలకం, కింది నైరుతి స్థానంలో లక్ష్మీదేవి శిలలు అగుపించగా గ్రామస్థులు అప్పటి నుంచి పూజలు నిర్వహించినట్లు కథనం. అనంతరం సదాశివరాయలు ఆలయాలను నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.


ఆలయం ఎదుట ఉగ్రనరసింహుడి రూపం

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి
బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 18: గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కు లిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరిచి ఈ నెల 21వ తేదీలోపు కలెక్టరేట్ సమీపంలోనున్న బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. 60 మంది అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీ నుంచి 60 రోజులపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7799043773, 9704204905 నెంబర్లను సంప్రదించాలన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.36వేలు

అనంతపురంరూరల్, మే 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500వేలు, కనిష్ఠంగా రూ.16వేలు, సరాసరి రూ.23వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 931టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఈ నెల 22, 23న
ఇంటర్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 18: ఇంటర్ మిగులు సీట్ల భర్తీకి ఈనెల 22, 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఈ నెల 22న నార్పల మండలం బీ పప్పూరు గురుకుల పాఠశాలలో, బాలికలకు సంబంధించి ఈ నెల 23న అనంతపురం రూరల్ మండలం కురుగుంట పాఠశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. నిర్దేశించిన కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు మెరిట్ కార్డు, టెన్త్ మార్కుల మెమో, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

సీడ్ మానిటరింగ్ సెల్ ప్రారంభం

అనంతపురం అర్బన్, మే 18: కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో సీడ్ మానిటరింగ్ సెల్‌ను శనివారం ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు 29 మండలాల్లో 2539 మంది రైతులు 2249 క్వింటాళ్ల వేరుశనగ కోసం పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈనెల 24 నుంచి విత్తన పంపిణీ మొదలు పెడతామన్నారు. జిల్లాలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్, విత్తనాల పంపిణీపై సమస్యలుంటే పనిదినాల్లో సీడ్ మానిటరింగ్ సెల్ నెంబర్లు 08554 - 232922, 231922కు ఫోన్ చేసి తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు
హాజరుకానున్న 13,332 మంది విద్యార్థులు

అనంతపురం విద్య, మే 18: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 13,332 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, గుత్తి పట్టణాల్లో ఏర్పాటుచేసిన 45 పరీక్షా కేంద్రాల్లో జరగనున్నాయి. నగరంలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు.

వజ్రాల కోసం అన్వేషణ

సుదూర ప్రాంతాల నుంచి జనం రాక
సందడిగా మారిన వజ్రకరూరు పరిసర పొలాలు

ఉరవకొండ, మే 18: ప్రతియేటా తొలకరి వర్షాలు మొదలవగానే వజ్రకరూరు ప్రాంతం కొత్త వ్యక్తులతో కళకళ లాడుతుంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో స్థానిక ప్రజలతోపాటు కడప, గుంతకల్లు, పామిడి, గార్లదిన్నె, ఉరవకొండ, అనంతపురం, గుత్తి, మదనపల్లి, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రజలు తెల్లవారుజామునే టిఫిన్, భోజన కారియర్లతో వజ్రకరూరుకు చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయభూముల్లో వజ్రాల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. కొద్దిగా మెరుస్తూ వజ్రంలాగా కనిపించిన ప్రతి రాయిని సేకరిస్తున్నారు. ఈ ప్రాంతంలో లభించే వజ్రాలు అత్యంత విలువైనవిగా చెబుతుంటారు. రూ.లక్ష మొదలుకొని రూ.20లక్షలకు విలువ చేసే వజ్రాలు లభిస్తున్నట్లు సమాచారం.



వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు, సేకరించిన రాళ్లను చూపుతున్న వ్యక్తి


కలశంతో భక్తురాలు


కొత్తూరులో జరిగిన నగరోత్సవంలో వాసవీమాత


నృత్యాలు చేస్తున్న మహిళలు


పాతూరు నగరోత్సవంలో అమ్మవారు


శివుడి వేష ధారణలో చిన్నారి

నేత్రపర్వం.. వాసవీ జయంత్యుత్సవం


పాతూరు నగరోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు


కలశాలతో ఊరేగింపు

ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగాయి. వేడుకల నేపథ్యంలో వాసవీ మందిరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలో కొత్తూరు, పాతూరు ఆర్యవైశ్య సంఘాలు, యువజన సంఘాలు, మహిళాసంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకల్లో వందలాదిమంది ఆర్యవైశ్యులు పాల్గొని అమ్మవారికి నీరాజనాలు పలికారు. దీంతో కొత్తూరు, పాతూరులలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయాలుభక్తజనంతో కిక్కిరిసిపోయాయి.

\- అనంతపురం కల్చరల్

టి-ఈఏపీ సెట్‌లో అనంత విద్యార్థుల ప్రతిభ

- ఇంజనీరింగ్‌లో కౌశల్ కుమార్‌కు రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకు
- అగ్రి, ఫార్మసీ విభాగంతో దివ్యతేజకు రాష్ట్రస్థాయి పదో ర్యాంకు


దివ్యతేజకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు


కౌశల్ కుమార్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లి

అనంతపురం సెంట్రల్/టౌన్/కొత్తచెరువు, మే 18: తెలంగాణ ఈఏపీ సెట్‌లో శ్రీసత్యసాయి జిల్లా విద్యార్థిని పోలా దివ్యతేజ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు సాధించింది. తలుపుల మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు పోలా రాంప్రసాద్ కూతురు దివ్యతేజ విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదివింది. బైపీసీ 984 మార్కులు సాధించింది.

అనంతపురం ఆర్కే. నగర్‌కు చెందిన కౌశల్ కుమార్ ఇంజనీరింగ్ స్ట్రీమింగ్‌లో రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ చదివాడు. కౌశల్ తండ్రి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, తల్లి మణిమాల గృహిణి. ఐఐటీలో ఇంజనీరింగ్ చేస్తానని కౌశల్ తెలిపారు.

- పారా మెడికల్ కోర్సు పరీక్షల్లో

అనంతపురం నగరానికి చెందిన నితిన్ చౌదరి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. స్టేట్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ ఈ ఏడాది జనవరిలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించింది. ఫలితాలు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. అనంతపురం నగరంలోని సీడ్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి దబ్బర నితిన్ చౌదరి 460 మార్కులకు గాను 414 మార్కులు సాధించి, స్టేట్ టాపర్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు తెలిపారు.


నితిన్ చౌదరి

పుట్టపర్తిలో కుండపోత

● ఇంకా పలు చోట్ల మోస్తారు వర్షం ● చల్లబడిన వాతావరణం ● ఉక్కపోత నుంచి ఉపశమనం పొందిన జనం



ధర్మవరం మండలం వసంతపురం వద్ద పారుతున్న వంక



కదిరిలో కురుస్తున్న వర్షం



పుట్టపర్తిలో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

పుట్టపర్తి రూరల్ మే 18: జిల్లాకేంద్రమైన పుట్టపర్తి పట్టణంలో శనివారం కుండపోత వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఎడతెరపి లేకుండా కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. వర్షపునీరు భారీగా రోడ్లపైకి చేరడంతో పాదచారులు, ద్విచక్రవాహనాదులు కాస్త ఇబ్బందులు పడ్డారు. వర్షం రాకతో వాతావరణం చల్లబడింది. గత మూడు నెలలుగా ఎండవేడిమితో విలవిల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. ముఖ్యంగా వర్షం రాకతో రైతన్నల మోములో ఆనందం వెల్లివిరిసింది.

పలు గ్రామాల్లో జోరువాన

ధర్మవరంరూరల్: మండలవ్యాప్తంగా పలుగ్రామాల్లో శనివారం సాయంత్రం జోరువాన కురిసింది. చిగిచెర్ల, చింతలపల్లి, వసంతపురం, గరుడంపల్లి, మల్కాపురం, గొట్లూరు తదితర గ్రామాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పారాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. రైతులు ముంగారు సేద్యాలకు సిద్ధమవుతున్నారు.

బత్తలపల్లిలో మోస్తారు వర్షం

బత్తలపల్లి: మండలంలో మోస్తారు వర్షం కురిసింది. గత ముడు నెలలుగా తీవ్ర ఎండ వేడిమితో విలవిల్లాడిన ప్రజలకు ఈ వర్షం వల్ల ఉపశమనం కలిగింది. మధ్నాహ్నం ఎండ తీవ్రత ఉన్న సమయంలో వర్షం జోరందుకుంది. దీంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. కాగా పలు కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ కావడంతో స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.

కదిరిలో ..

కదిరిఅర్బన్: పట్టణంలో శనివారం మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ప్రజలకు ఉక్కపోతనుంచి ఉపశమనం కలిగింది.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ధర్మవరం, కదిరిలలో ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి వారు

ధర్మవరం, మే 18: పట్టణంలోని ఇందిరానగర్‌లో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం స్వామివారి 16వ ఆరాధనోత్సవాలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో పాటు వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో హోమాలు జరిపారు. ప్రతిఏడాది ఈ ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది.

కదిరిఅర్బన్: పట్టణంలోని కోనేరు వద్ద వెలసిన వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకు మూలవిరాట్‌కు సుప్రభాత సేవ చేశారు. అనంతరం పంచామృతాభిషేకం, 108 సుగంధద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. 9గంటలకు గణపతిపూజ, కంకణ ధారణ, సహస్రనామావళి పూజ, గణపతి హోమం, నవగ్రహాల హోమం చేపట్టారు. మధ్యాహ్నం 12గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు.

విత్తనవేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభం

ధర్మవరంరూరల్, మే18: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం శనివారం నుంచి ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయాధికారి ముస్తాఫా తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రతిరోజు ఆర్‌బీకేలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అరఎకరా వరకు పొలం ఉన్న రైతుకు 30కేజీల విత్తన వేరుశన బ్యాగును ఒకదానిని సబ్సిడీతో రూ.1710లకు అందించనున్నట్లు చెప్పారు. అర ఎకరా నుంచి ఎకరా వరకు ఉన్న వారికి రెండు బ్యాగులను (60 కేజీలు) రూ.3420లతో అందించనున్నామన్నారు. ఎకరా పైన ఉన్న రైతులకు మూడుబ్యాగులను (90కేజీలు) రూ.5130లకు అందించనున్నట్లు చెప్పారు. కావున రైతులు ఆయా గ్రామ పరిధిలోని ఆర్‌బీకేలకు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం, మొబైల్ ఫోన్ తీసుకురావాలని, ఎవరి పేరుమీద భూమి ఉందో సంబంధింత రైతు తప్పనిసరిగా వచ్చి వేలిముద్ర వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాడిమర్రి: ఖరీఫ్ సాగుకు సంబంధించి విత్తన వేరుశనగ కోసం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు ఏఓ రమాదేవి ప్రకటనలో తెలిపారు. విత్తన వేరుశనగ అవసరమయ్యే రైతులు ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. 40శాతం రాయితీతో విత్తన పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 30 కేజీలున్న బస్తా రూ.1710లకు ఇవ్వనున్నట్లు చెప్పారు. అర ఎకరా ఉన్న వారికి ఒక బస్తా, అర ఎకరా నుంచి ఎకరా ఉన్న వారికి రెండు బస్తాలు, ఎకరా పైగా ఉన్న వారికి మూడు బస్తాల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు.

మండలానికి చేరిన విత్తన వేరుశనగ



విత్తనకాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

తనకల్లు, మే 18: మండలంలోని వివిధ గ్రామాల రైతు భరోసాకేంద్రాలకు శనివారం విత్తన వేరుశనగ కాయలు చేరాయి. ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం విత్తన వేరుశనగను మండలానికి చేర్చినట్లు ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. విత్తన నాణ్యతను రైతు సంఘం నాయకులు రైతులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. త్వరలోనే రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేయడానికి రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 7వేల క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపగా, 3వందల క్వింటాళ్ల చేరినట్లు చెప్పారు. మిగిలిన కాయలు త్వరలో వస్తాయన్నారు.

70 శాతం సబ్సిడీతో ఇవ్వాలి: బీజేపీ

ముదిగుబ్బ, మే18: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విత్తన వేరుశనగ కాయల్ని 70శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర రీసెర్చ్ కోకన్వీనర్ సోమల ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వేరుశనగ పంటను ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సాగు చేస్తున్నారు. అయితే సకాలంలో వర్షం పడక కరువు విలయతాండవం చేస్తోందన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఇలాంటి పరిస్థితిలో 70శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లలో వేరుశనగ సాగు 8.77 లక్షల హెక్టార్ల నుంచి, 3.79 లక్షల హెక్టార్లకు తగ్గిపోయిందన్నారు. అటు వాతావరణం ఇటు రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల రైతుల ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయన్నారు. కనుక ప్రస్తుతం ఇస్తున్న 40శాతం సబ్సిడీతో కాకుండా 70శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు రైతులకు సరఫరా చేయాలని ఆయన కోరారు.

20న మండల సర్వసభ్య సమావేశం

నల్లచెరువు, మే 18: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ ఎం. మణెమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న సమావేశం జరగాల్సి ఉండగా.. అనివార్య కారణాల వల్ల 20వ తేదీకి వాయిదా వేశామన్నారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని సూచించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కదిరిఅర్బన్, మే 18: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు కదిరి ఆర్టీసీ డిపోనుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ మైనొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నామన్నారు. 22న ఉదయం 9గంటలకు బస్సులు బయలు దేరుతాయన్నారు. ఎక్స్‌ప్రెస్‌లో పెద్దలకు ఒక్కొక్కరికి రానుపోను ఛార్జి రూ1,050, సూపర్ లగ్జరీలో రూ.13వందల చొప్పున నిర్ణయించామన్నారు. ఆసక్తి గలవారు 9052537054కు సంప్రదించాలని సూచించారు.

ఘనంగా గంగాభవానీ అమ్మవారి ఊరేగింపు



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) రథంలో కొలువుదీరిన అమ్మవారి ఉత్సవ విగ్రహం

గాండ్లపెంట, మే 18: మండలకేంద్రంలో గంగాభవాని అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శనివారం రెండో రోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. రథం ముందు కళాకారులు కీలుగుర్రాలతో సంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ కృష్ణవేణి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

హంసవాహనంపై ఊరేగిన పార్వతీపరమేశ్వరులు



హంసవాహనంపై ఊరేగుతున్న పార్వతీపరమేశ్వరులు

కొత్తచెరువు, మే 18: మండలకేంద్రంలో సంఘమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం హంసవాహనంపై పార్వతీపరమేశ్వరులు గ్రామ పురవీధులలో ఊరేగారు. ముందుగా నిర్వాహకులు ఎడ్లబండిపై హంసవాహనాన్ని ఏర్పాటుచేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి డప్పువాయిద్యాల నడుమ గ్రామ పురవీధులలో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పూజలు చేయించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మనోహర్‌నటరాజ్, ఫణి, నాగరాజ్, అర్చకులు సాయి పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, మే 18: మండలంలో ప్రసిద్ధి గాంచిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేకువజామునే స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు. ఆలయ కమిటీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, ఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ధర్మవరం,మే 18: పట్టణంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఎంవీఐ వరప్రసాద్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ మేరకు వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 5 వాహనాలకు కలిపి రూ.30వేలు జరిమానా విధించినట్టు ఎంవీఐ తెలిపారు. ఎవరైనా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలను తిప్పితే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వరప్రసాద్, సిబ్బంది

తాగునీటి కోసం ఆందోళన



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న 12వ వార్డు ప్రజలు

పుట్టపర్తి, మే 18: తమ వార్డులో రెండుబోర్లున్నా తాగునీరు సరిగా రావడం లేదని, దీంతోతీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్య వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని 12వవార్డు ప్రజలు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. 12వార్డుకు చెందిన నాగేంద్ర, భాస్కర్, మల్లికార్జున, అనసూయ, జయమ్మలతో పాటు మరికొంతమంది మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ ఎదుట ఆందోళన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ రెండునెలలుగా కాలనీలో తాగునీరు రావడం లేదన్నారు. దీంతో గుక్కెడు నీటి కోసం విలవిల్లాడుతున్నామన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడంలేదని మండిపడ్డారు. అసలే ఎండాకాలం తాగునీరు ఇవ్వకపోతే ఎలాగంటూ కమిషనర్ అంజయ్యను ప్రశ్నించారు. ఇప్పటివరకు విషయం తన దృష్టికి రాలేదని తప్పకుండా సమస్య ను పరిష్కరిస్తామంటూ కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం వారు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

పెరిగిన పోలింగ్ శాతం

● గెలుపుపై ఎవరిధీమా వారిదే

గాండ్లపెంట, మే 18: ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంపై ఆయా పార్టీల నాయకులు ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 21,485మంది ఓటర్ల ఉండగా, అందులో 18,319మంది ఓటు వేశారు. 24 పోలింగ్ కేంద్రాల్లో వారు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 85.2 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో పోలింగ్ శాతం గతంలో కంటే ఈసారి అధికంగా ఉంది. పోలింగ్ శాతం పెరగడంతో ప్రభుత్వంపై వ్యతిరేకతే కారణమని టీడీపీ వారు చెబుతుండగా.. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని వైసీపీ పేర్కొంటున్నారు. దీంతో తామంటే తామే గెలుస్తామని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపై టీడీపీ, వైసీపీ శ్రేణులు బూత్‌లవారీగా మెజారిటీపై బెట్టింగ్‌లు కడుతున్నారు. మండలంలో ఏ ఇద్దరు కలిసినా, గెలుపు ఓటముల విషయంపైనే చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

విషపు నీరు తాగి పాడి ఆవులు మృతి



మృతి చెందిన పాడి ఆవులు

తనకల్లు, మే 18: మండలంలోని వేపలపల్లిలో మూడు పాడి ఆవులు విషపునీరు తాగి శుక్రవారం రాత్రి మృతి చెందాయి. బాధితులు శనివారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో పక్క పక్క ఇళ్లల్లోనే పాడిరైతులు వెంకటరమణ, రామప్ప ఉన్నారు. అయితే వెంకటరమణకు చెందిన ఒక ఆవు, రామప్పకు చెందిన రెండు ఆవులు రోజువారిగానే.. శుక్రవారం ఉదయం మేతకోసం పొలానికి వెళ్లి సాయంత్రం ఇళ్లకు చేరుకున్నాయి. అయితే వారిలోకి ఒకరి ఇంటివద్ద చెట్లకు పిచికారీ చేయడానికని యూరియా కలిపిన నీరు ఉంచారు. పొలం వద్ద నుంచి వచ్చిన ఆవులు ఆ నీటిని తాగేశాయి. ఇది గమనించని ఆ రైతులు పాడిఆవులను కట్టేసి మేత వేశారు. కాగా కొద్దిసేపటికి ఆవులు ఉన్నట్టుండి నేలకొరిగాయి. రైతులు వెంటనే పశువైద్యుడు హరినాథ్‌రెడ్డిని సంప్రదించారు. పరీక్షించిన పశువైద్యుడు అప్పటికే ఆవులు మృతిచెందినట్లు నిర్ధారించాడు. దీంతో పాడి రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాము చేసిన పొరపాటు వల్ల పాడి ఆవులు మృతి చెందాయని ఆవేదన చెందారు. దాదాపు రూ.రెండులక్షల దాకా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందదని పశువైద్యుడు తెలిపారు. కేవలం పాడిఆవుల ద్వారా జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలను దాతలు ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

కుక్కల దాడిలో 36 గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

గాండ్లపెంట, మే 18: మండలంలోని కటారుపల్లి పంచాయతీ గొల్లపల్లిలో నివాసమున్న ఆదెప్పకు సంబంధించిన 32 గొర్రెలు కుక్కలదాడిలో మృతిచెందాయి. బాధితుడు శనివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రోజూమాదిరిగానే శుక్రవారం కూడా గొర్రెలను మేపుకుని తోలుకెళ్లానని, సాయంత్రానికి తన ఇంటి సమీపంలో దొడ్డిలోకి తోలానని తెలిపారు. అయితే రాత్రి సమయంలో కుక్కల గుంపు గొర్రెల మందలోకి చొరబడి ఇష్టమొచ్చినట్లుగా గొర్రెలపై దాడి చేసి కొరికి చంపేశాయన్నారు. శనివారం తెల్లవారు జామున వెళ్లి చూస్తే 36గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయని వాపోయారు. దాదాపు రూ.మూడు లక్షలకు పైగా నష్టం జరిగిందని ఆవేదన చెందారు. గొర్రెలను మేపుకుని జీవనం సాగిస్తున్న తనకు జీవనాధారం పోయిందని విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘటనాస్థలాన్ని పశువైద్యాధికారి చెన్నకేశవులనాయక్ పరిశీలించి, గాయపడిన గొర్రెలకు చికిత్స అందించారు.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవాలు

● కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ఆర్యవైశ్యుల ప్రత్యేక పూజలు



ధర్మవరంలో ప్రత్యేకాలంకరణలో వాసవీమాత



పుట్టపర్తిలో ..



తాడిమర్రిలో..

ధర్మవరం, మే 18: వాసవీమాత జయంత్యుత్సవాలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ మహిళా సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. అర్చకులు ఉదయమే అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం పాండురంగ స్వామి ఆలయం నుంచి ఆర్యవైశ్య మహిళలు కలశాలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ గణపతిపూజ, నవగ్రహ ఆరాధన, కలశస్థాపనపూజ నిర్వహించారు. అదేవిధంగా కుంకుమార్చన గావిస్తూ వాసవీమాత నామాలు పఠించారు భక్తులకు అన్నదానం జరిగింది.

పుట్టపర్తి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంత్యువ్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు జరిపారు. పండితులు అన్నాజీ అమ్మవారి జీవిత చరిత్రను భక్తులకు ప్రవచనాలుగా వినిపించారు. మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఉత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

తాడిమర్రి: వాసవీమాత జయంత్యుత్సవాల సందర్భంగా మండలకేంద్రంలో శనివారం వాసవీ మాతకు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు స్థానిక కోనేటిబావి నుంచి గంగా జలం తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, వాసవీ నామ పారాయణం నిర్వహించి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు పొందారు.

కస్తూర్బా స్కూల్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ

ముదిగుబ్బ, మే18: మండల కేంద్రంలోని కస్తూర్బా స్కూల్ కాలనీలో అనేక సమస్యలు నెలకొన్నాయని, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కస్తూర్బా స్కూల్ కాలనీలో ప్రారంభం నుంచి నేటి వరకు అనేక సమస్యలు తిష్ట వేశాయన్నారు. కాలనీలో దాదాపు 3వందలకు పైగా ఇళ్లు ఉన్నాయని, వెయ్యి మందికి పైగా జనాభా నివసిస్తున్నారని తెలిపారు. అయితే అక్కడ వీధి లైట్లు, లేవని, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయలేదని, సీసీ రోడ్లు కూడా లేవని, ప్రభుత్వ పాఠశాల లేదని వాపోయారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటను ప్రభుత్వం ఆయా సౌకర్యాలు నెలకొల్పాలని కోరారు. అలాగే ప్రతి ఇంటికి డోర్ నెంబర్లు ఏర్పాటు చేసి, వాటిని రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటికి సత్యసాయి తాగునీరు సరఫరా చేయాలన్నారు. కాలనీ సమీపంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి అన్ని బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతంలో మినీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

ధర్మవరం, మే 18: పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ కేతాలోకేశ్ శనివారం ఓ విద్యార్థిని కంటి వైద్యం కోసం ఆర్థిక సాయం అందజేశారు. మాధవనగర్‌లోని రామాంజనేయులు కుమార్తె లహరి 9వతరగతి చదువుతోంది. ఆ విద్యార్థినికి కంటి వైద్యం కోసం కౌన్సిలర్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ ప్రారంభం : ఏఓ

హిందూపురం, మే 18 : ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించే వేరుశనగ విత్తన కాయల కోసం శనివారం రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు ఏఓ సురేంద్రనాయక్ తెలిపారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటే స్టాక్ వచ్చాక పంపిణీ చేస్తామని తెలిపరు. కే6 రకం 30కేజీల బస్తా రూ.2850 ఉండగా 40శాతం సబ్సిడీ పోను రైతులకు రూ.1710తో అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆర్బీకేల్లో పాసుపుస్తకంతోపాటు ఆధార్, సెల్ ఫోన్‌నంబరు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

చిలమత్తూరు: ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో వేరుశనగ పంట సాగుచేసే రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు ఓటీపీ రావడానికి సెల్ ఫోన్ తీసుకొని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. అర ఎకరం ఉన్న రైతులకు 30 కిలోల బస్తా, అర ఎకరం పైన ఉండి ఎకరం లోపు ఉన్న వారికి రెండు బస్తాలు, ఎకరం పైన ఉన్న వారికి మూడు బస్తాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

మడకశిర రూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే మండలంలోని రైతులు సబ్సిడీ విత్తన కాయల కోసం రైతు భరోసా కేంద్రాల్లో వారి వివరాలు నమోదు చేయించు కోవాలని వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాలో పేర్లు నమోదు చేయించుకున్నవారికే సబ్సిడీ విత్తకాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడిబండ: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ వీరనరేష్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులు ఆర్బీకే కార్యాలయంలో ఆధార్‌కార్డు, పాసుపుస్తకం, తీసుకెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను చెల్లించి సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పొందాలని కోరారు.

విద్యుత్ లైన్‌ను పరిశీలించిన ఏఈ

గుడిబండ, మే 18: మండలంలోని జమ్ములబండ గ్రామంలో ఓ ఇంటి మిద్దెపై నుంచి వెళ్తున్న హైవోల్టేజ్ విద్యుత్ లైన్‌ను ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథ్ శనివారం పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం 'విద్యుత్‌లైను మార్చండి' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. అందుకు స్పందించిన ఏఈ విశ్వనాథ్ జమ్ములబండ గ్రామాన్ని సందర్శించారు. హైపవర్ విద్యుత్‌లైన్‌ను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏఈ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


శివకుమార్ (ఫైల్)

గోరంట్ల, మే 18: భార్య కాపురానికిరాలేదనే మన స్తాపంతో పట్టణంలోని వడ్డెవారి వీధిలో నివాసముంటున్న ఎరుకల శివకుమార్ (36) అనే డ్రైవర్ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వడ్డెవారి వీధికి చెందిన శివకుమార్, నాగమణి దంపతుల మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఆమె మూడునెలల కిందట ఆమె అలిగి పుట్టినిల్లైన ధర్మవరం సమీపం లోని నారసింపల్లికి వెళ్లింది. కాపురానికి రావాలని శివకుమార్ కోరినా ఆమె రాలేదు. అతడు కుమారులైన గౌతమ్, యశ్వంత్‌ను ఇటీవల ఇంటికి తీసుకొచ్చాడు. అయినా భార్య రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివకుమార్ శనివారం ఇంట్లోని రేకుల షెడ్డు పైకప్పునకు ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరామప్ప కొన్నేళ్ల కిందట కుటుంబ సమస్యలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుకొండకు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఘనంగా బాలికా దినోత్సవం


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీటీ సిబ్బంది

అగళి, మే 18 : కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్డీటీ భవనంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సమాజంలో బాలికల చదువు, తిండి ఆరోగ్యంతో పాటు వారి లక్ష్యం నెరవేర్చడంలో తల్లిదండ్రులు, బంధువులు వివక్ష చూపరాదన్నారు. అందరూ బాధ్యతగా గుర్తించి ప్రోత్సహిస్తే బాలికలు భవిష్యత్తులో మంచి స్థాయిలో రాణిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంతోపాటు ఆర్డీటీ లాంటి స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాలలోని బాలికల అభివృద్ధికి తల్లిదండ్రులతో కలిసి కృషిచేస్తున్నాయని తెలిపారు. యూఆర్డీ పద్మ ఏటీఎల్ ఓబులేసు, సిబ్బంది హనుమంతరాయుడు, వెంకటేశులు, శివప్రసాద్, చలపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సిబ్బంది తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.

కుక్కల దాడిలో 36 గొర్రెల మృతి

గాండ్లపెంట, మే 18: మండలంలోని కటారుపల్లి పంచాయతీ గొల్లపల్లిలో నివాసమున్న ఆదెప్పకు సంబంధించిన 32 గొర్రెలు కుక్కలదాడిలో మృతిచెందాయి. బాధితుడు శనివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రోజూమాదిరిగానే శుక్రవారం కూడా గొర్రెలను మేపుకుని తోలుకెళ్లానని, సాయంత్రానికి తన ఇంటి సమీపంలో దొడ్డిలోకి తోలానని తెలిపారు. అయితే రాత్రి సమయంలో కుక్కల గుంపు గొర్రెల మందలోకి చొరబడి ఇష్టమొచ్చినట్లుగా గొర్రెలపై దాడి చేసి కొరికి చంపేశాయన్నారు. శనివారం తెల్లవారు జామున వెళ్లి చూస్తే 36గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయని వాపోయారు. దాదాపు రూ.మూడు లక్షలకు పైగా నష్టం జరిగిందని ఆవేదన చెందారు. గొర్రెలను మేపుకుని జీవనం సాగిస్తున్న తనకు జీవనాధారం పోయిందని విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘటనాస్థలాన్ని పశువైద్యాధికారి చెన్నకేశవులనాయక్ పరిశీలించి, గాయపడిన గొర్రెలకు చికిత్సలు అందించారు.



పురంలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


ప్రత్యేక అలంకరణలో డీబీ కాలనీలో వాసవీమాత



చిలమత్తూరులో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు, ప్రత్యేక అలంకరణలో వాసవీమాత మూలవిరాట్

ఘనంగా వాసవీ జయంతి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీమాత జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. హిందూపురం పట్టణంలోని ఆలయంలో తెల్లవారుజాము నుంచే ఆలయంలో మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది ఆర్యవైశ్యులు ఉదయం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టి, చిన్నమార్కెట్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయంలో భక్తులు తమ ఇళ్లలోనే తయారు చేసిన కేక్ కట్ చేసి, ఒకరికొకరు వాసవీ జయంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వాసవీ మహిళా మండలి, వాసవీ భజనా బృందం, కుసుమపుత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో రెండు రోజులుగా వివిధ పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం వీడీ రోడ్డులోని ధర్మశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్ర మంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు జేపీకే రాము, పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు, రాఘవేంద్ర, ప్రకాష్, మహేష్ పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అలాగే పట్టణంలోని డీబీ కాలనీలో అష్టలక్ష్మీ వాసవీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులు గా వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వాసవీ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కట్టా రామచంద్ర గుప్త, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి వైపీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చిలమత్తూరు, గోరంట్ల, అగళి, గుడిబండ తదితర మండలకేంద్రాల్లో, కర్ణాటకలోని పావగడ పట్టణంలోని వాసవీమాత ఆలయాల్లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలతో పాటు సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. గోరంట్లలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో 95శాతం మార్కులు సా ధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు నగదు ప్రోత్సాకాలు అందించారు. బెంగుళూరునుంచి వచ్చిన వాసవీ సిస్టర్స్ గాన కచేరి ఆహుతులను అలరించింది.


పావగడలో పూలపల్లకిలో ఊరేగుతున్న వాసవీమాత


గోరంట్లలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు


అగళిలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


గుడిబండలో వాసవీజయంతి వేడుకల్లో ఆర్యవైశ్య మహిళలు

రెండు రోజులుగా.. విస్తారంగా వర్షాలు

- రైతుల్లో హర్షం... ఖరీఫ్ సాగుకు సన్నద్ధం
- వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం


ఆర్ కొట్టాల సమీపంలో పొలాల్లో కురుస్తున్న వర్షం

రొద్దం, మే 18 : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం 4గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా మండలంలో కురుస్తు న్న భారీ వర్షాలకు పొలాల్లో నీరు పారింది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలు దున్ని పంటలు సాగు చేసుకోవడానికి మంచి అదునుగా ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గౌనిమేకల పల్లి చెరువులోని గుంతల్లో నీరు చేరింది. వేసవి తాపంతో అల్లాడిపోతున్న జనానికి కాస్త ఉపశమనం లభించింది. మే నెలలో ఇలా భారీ వర్షాలు కురవడం చాలా అరుదని రైతులు అంటున్నారు. ఈ వర్షాల కారణంగా పశుగ్రాసం, తాగునీరు దొరుకుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కురిసిన భారీ వర్షానికి కూరగాయలు తడిసి ముద్దయ్యాయి. దీంతో వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పెనుకొండ రూరల్ : బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో పెనుకొండ మండలంలో రెండు రోజుల నుంచి తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. మేఘాలు కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రస్తుత వేసవిలో ఉక్కపోతతో అల్లాడపోతున్న ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

మడకశిర : నియోజకవర్గంలో రెండు రోజుల నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తుండ డంతో పలు చోట్ల కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీరు చేరుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా రు. ఖరీఫ్ సాగు కోసం సన్నద్ధం చేసుకుంటున్నారు. పొలాలను దుక్కులు చేసే పనిలో బిజీబిజీగా ఉన్నా రు. నియోజకవర్గంలోని పలు మండలాలలో శుక్ర వారం ఓ మోస్తారు వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని చోట్ల మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. మడకశిర మండలం లో 51.6మి.మీ, అమరాపురం మండలంలో 6.8మి.మీ లు, గుడిబండలో 12.2మి.మీ వర్ష పాతం నమో దైంది. వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధ అవుతున్న రైతులు ప్రభుత్వ సబ్సిడీతో అందించే వేరుశనగ విత్తన కాయల పంపిణీ కోసం ఎదురు చేస్తున్నారు. రైతులు గత యేడు అప్పులు చేసి ఖరీఫ్‌లో పంట సాగు చేశారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట దెబ్బతిని పూర్తిగా నష్ట పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఈ యేడు ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు పడుతుండడంతో పంటలు పండుతాయన్న గంపెడు ఆశతో ఖరీఫ్ సాగుకు సిద్ధం అవుతున్నామని పలువురు రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.


రొద్దంలో వర్షంతో ఇబ్బందులు పడుతున్న కూరగాయల వ్యాపారులు


మడకశిర సమీపంలో పొంగిపొర్లుతున్న చెక్‌డ్యామ్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త: డీఎంహెచ్ఓ


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

పెనుకొండ రూరల్, మే 18 : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న వేళ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ వీఎస్ మంజువాణి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆమె శనివారం గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోజూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఆరోగ్యకేంద్రంలోని ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజునాయక్, సీహెచ్ఓ భారతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన


సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ టౌన్, మే 18: మధ్యవర్తిత్వంపై సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పరిధిలో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహించాల్సి ఉంటుందని, దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయసేవ సంస్థ అధికారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బుజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపలసయ్యద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటికీ పూర్తికాని సచివాలయ భవనాలు

రొళ్ల, మే 18: మండలంలోని పలు గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు పూర్తికాలేదు. ఇంకా వివిధ దశల్లో ఉన్నాయి. మండల కేంద్రంలోని సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.45లక్షలు విడుదల చేసింది. మొదటి విడతలో నిధులు విడుదల కావడంతో ఎంతో ఉత్సాహంగా పనులు చేపట్టా రు. రెండో విడతలో నిధులు రాకపోవడంతో పాలు భవనాల నిర్మాణం లింటిల్, రూఫ్ లెవెల్ వరకు నిర్మించి వదిలి వేశారు. మల్లినమడుగులో సచివాలయ భవనం టాప్ లెవెల్ వరకు చేపట్టారు. ఎం రాయాపురం, రొళ్ల సచివాలయాల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో భవనాలను అద్దెకు తీసుకొని అందులో విధులు నిర్వహిస్తున్నారు. ఏది ఏమైనా భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.


అసంపూర్తిగా నిలిచిన రొళ్ల సచివాలయ భవన నిర్మాణం

బియ్యం పంపిణీతో సరి..!

అదీ... 80శాతం మందికే..

మడకశిర రూరల్, మే 18 : ఎన్నిల నేపథ్యంలో ఈ నెలకు సంబంధించి మండలంలోని రేషన్ కార్డు లబ్దిదారులకు ఎఫ్‌పీ షాపులలో బియ్యం పంపిణీతో సరిపెట్టారు. మండలంలో 62 చౌకదుకాణాలకు గాను 25,269 కార్డులు ఉన్నాయి. వాటికి 3,894 క్వింటాళ్ల బి య్యాన్ని ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకు పంపిణీ చేస్తారు. కార్డుదారులకు బియ్యంతో పాటు రాగిపిండి, చక్కెర, కందిబేడలు అందించాల్సి ఉంది. అయితే ఈ నెలలో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేశారని లబ్ధిదారులు వాపోతున్నారు. బియ్యాన్ని కూడా ఈ నెల 13న ఎన్నికల పోలింగ్ సందర్భంగా రెండు రోజులు పంపిణీ చేయలేదని, ఇప్పటికీ పలువురికి ఇవ్వలే దని అంటున్నారు. పంపిణీ గడువు సోమవారంతో ముగిసింది. ఇప్పటికి 80 శాతం కార్డులకు మాత్రమే బియ్యం అందినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంకా 20 శాతం మంది ఉన్నట్లు వారు తెలిపారు. బియ్యం పంపిణీ గడువును మరో రెండు రోజులు పొడిగించాలని బియ్యం అందని కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు.

నాలుగు నెలలుగా అందని జీతాలు



హిందూపురం ప్రభుత్వాసుపత్రి

హిందూపురం అర్బన్, మే 18: వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి సేవలు చేసేది నర్సులు, ఎఫ్ఎన్ఓలు ఎంఎన్ఓలు, శానిటేష్ సిబ్బంది. మరి అలాంటి సిబ్బందికే ఇబ్బంది వచ్చినా ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నెలకొంది. హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. నాలుగు నెలలుగా జీతాలు అందించకపోడంతో కటుంబ పోషణ ఎలా పోషించాలని వారు ఆవేదన చెందుతున్నారు. ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇచ్చే వేతనం నెలకు కేవలం రూ. 12 వేలు. అంటే రోజుకు రూ. 400. ఈ సొమ్ముతోనే నెల రోజుల పాటు కుటుంబాన్ని పోషించుకునే వారు చాలా మంది ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నెలసరి ఆహార దినుసులకు ఈ ఆదాయం ఏ మాత్రం చాలదు. దీంతో పాటు ఏవైనా సమస్యలు వస్తే ఇక వారు అప్పులు చేయక తప్పదు. చేసినా తీర్చుకునే పరిస్థితి ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలుపుతున్నారు.

ఆవేదనలో నర్సులు, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓ, శానిటేషన్ సిబ్బంది

నిత్యవసర దుకాణాల్లో ఇప్పటికే చాల వరకు అప్పు ఉన్నట్లు చెబుతున్నారు. అప్పు పేరుకుపోవడంతో ఇక పాత అప్పు కడితే కానీ కొత్త అప్పు ఇవ్వలేమని దుకాణాల యజమానులు తెగేసి చెబుతున్నట్లు సమాచారం. ఇకపై పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం శానిటేషన్ పని చేసే తమకు కూడా వైసీపీ ప్రభుత్వంలో జీతాలు రాలేదంటే ఎంత దౌర్భాగ్యమని ఆగ్రహిస్తున్నారు.

బిల్లులు పంపాం

నర్సులు, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓ, శానిటేషన్ సిబ్బంది వేతనాలకు సంబంధించి ప్రభుత్వానికి బిల్లులు పంపాం. రెగ్యులర్ సిబ్బందికి శుక్రవారం రెండు నెలల జీతాలు పడ్డాయి. ఇప్పుడు నేరుగా ట్రెజరీ ద్వారా వేతనాలు జమఅవుతాయి మరో రెండు రోజుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు వచ్చే అవకాశం ఉంది.

- లింగన్న, సూపరింటెండెంట్, ప్రభుత్వాసుపత్రి, హిందూపురం

రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

ఇబ్బందిపడుతున్న వాహనదారులు


వట్టిబెట్ట అటవీప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

గుడిబండ, మే 18 : మండలంలోని వట్టిబెట్ట అటవీప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు అడ్డంగా ఏపుగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారుటు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్న అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.